# సుమతి

శ్రీమతి పద్మినీ చిత్తరంజన్




అప్పుడే ఎండ 'చుర్రుమని వీపు మాడుస్తోంది. ఇంకా పది గంటలు కాలేదు. కాలేజీలకు, ఆఫీసులకు, హైస్కూళ్ళకు వెళ్ళేవాళ్ళు పరుగులాంటి నడకతో గమ్యం చేరటానికోసం తాపత్రయ పడుతున్నారు.

'అబ్బ ఇప్పుడే కాళ్ళు మాడుతున్నాయి' అనుకుంటూ సీతాపతి నడక వేగం హెచ్చించాడు. దాదాపు మైలు నడిచిన అలసట చెమటరూపంలో అతని నుదురు చుట్టుకుంది. ఒక్కక్షణం నడక వేగం తగ్గించాడు సీతాపతి. చల్లని చెట్టునీడ కనబడేసరికి కాబోలు కాళ్ళు 'ముందుకెళ్ళము' అని సమ్మె చేయబోయాయి. 'పది గంటలకి ఇంటర్వ్యూ'—అని సీతాపతి మనస్సు తొందర పెడుతోంది.

'టైమెంతయిందండీ' వెళ్తున్న ఓ నల్ల కళ్ళద్దాల సూటువాలాను అడిగాడు సీతాపతి. అతను వినిపించుకోనట్టే ముందుకు పోతున్నాడు. 'సార్! టైము' మళ్ళీ రెట్టించాడు సీతాపతి. ఇక గత్యంతరం లేదన్నట్టు అతనొకసారి వాచీవంక చూశాడు. ఇబ్బందిగా ముఖంపెట్టి 'ఏమో తెలీదు' అని ముందుకు సాగిపోయాడు.

సీతాపతికి ఆ సమాధానం అర్థంకాలేదు. తనలో నవ్వుకుని మళ్ళీ నడకసాగించాడు. బి. ఏ. ఫస్టుక్లాసుతో పాసైన తర్వాత సీతాపతికి చాలా విషయాలు అర్థంకావటం మానేశాయి. అందులో ఈ సమాధానం ఒకటి. తను ఇంత కష్టపడి బి. ఏ. ఎందుకు చదివినట్టు ? ఎన్నో ఇంటర్వ్యూలలో తనకి ఒక్కచోట ఉద్యోగం ఎందుకని రాలేదు ? తనతోపాటు ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళలో ఆరుసార్లు బి. ఏ. తప్పి పాసైన లోకనాథం, అత్తెసరు మార్కులతో అయిందనిపించిన శ్యామ్రావు ఎలా ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇలాటి విషయాలు సీతాపతికి అర్థంకావు. అన్నటికన్న ప్రధానమైంది మరోటుంది. ఉన్న రెండకరాం కొంద్ర తాకట్టు పెట్టి తల్లి తనని ఎందుకు చదివించిందో మరీ బొత్తిగా తెలియకుండా పోయింది సీతాపతికి.

ఎలాగైతేనేం చేరవలసినచోటు వచ్చేసింది. ఆదరాబాదరా గేటులోపలికి అడుగుపెట్టాడు సీతాపతి. అక్కడ మరో తొమ్మింది తన లాంటి వారే ఉన్నారు. రెండు బెంచీలమీద సర్దుకుని కూచుని ఏదో బాతాఖానీ వడుపు

తున్నారు. సీతాపతి వెళ్ళి నిలబడ్డాడు.

'ఇలా కూచోండి' కొంచెం చోటు దొరికింది

'ఇంటర్‌వ్యూ ప్రారంభించారా' ఆదుర్దాగా అడిగాడు సీతాపతి.

'అబ్బే ఇప్పుడేనా ప్రారంభించటం. మనని పదికి రమ్మంటారుగానీండి వాళ్ళు వచ్చి మనల్ని పిలిచేసరికి అధమం పదకొండు' అన్నాడతను.

'ఈ ఉద్యోగమైనా వస్తే బాగుండు' మనసులో దేవుడిని ప్రార్థించాడు సీతాపతి.

బి. ఎ. అయి యేడాది దాటుతోంది. ఈ యేడాదిలో పది పన్నెండుసార్లు పల్లె నించి పట్నం రావటం. తిరిగి తలవేలాడేసుకుని వెళ్ళటం అవుతోంది. మొన్న కరణం కనబడి 'అబ్బీ! నువ్వు ఉద్యోగంకోసం పట్నం తిరిగే ఖర్చుతో ఈ పాటికి ఓ కిరాణా కొట్టు పెట్టుంటే నిక్షేపంగా సంపాదించుకునే వాడివిరా' అన్నాడు.

కరణం రామయ్య సీతాపతికి మామయ్య అవుతాడు వరసకి. అడపా దడపా ఆకుటుంబాన్ని ఆదుకునేవాడు అతనే. సీతాపతి పట్నం వచ్చేందుకు పైకం రామయ్యనే అడిగి తెచ్చాడు. 'అబ్బీ! ఈ ఉద్యోగంగాని రాకపోయెనా ఇహ నువ్వు పట్నం మొహం చూడక. తెలిసిందా, నీ అమ్మ నువ్వు ప్రయోజకుడవై సంపాదించి కాపరాన్ని గట్టెక్కిస్తావని ఆశపడుతోంది. అందుకని ఈసారి ఒక్కసారి చూడు. ఇలా ఇంట్లో గోళ్ళుగిల్లుకుంటూ దరఖాస్తులు రాస్తూ ఉంటే లాభంలేదు. అర్జనాపరుడివి కావాలి' ఇదీ డబ్బుతోసహా రామయ్య ఇచ్చిన అమూల్యమైన సలహా.

'నిజమే' సీతాపతి ఆలోచనలోపడ్డాడు. 'నాన్న పోయిన నాటినుంచీ అమ్మ సంసారాన్ని ఎలా లాక్కొస్తూందో ఆవిడకే తెలుసు. ఎవరన్నా ఏదన్నా అంటే తన కొడుకు ఉద్యోగంలో చేరగానే కష్టాలన్నీ తీరిపోతాయనీ, ఆ ఒక్కకూతురికీ గొప్ప సంబంధం చేస్తామనీ అంటుంది.' సీతాపతికి నవ్వు వచ్చింది. 'ఇప్పుడీ ఉద్యోగం తనకే వచ్చినాకూడా అమ్మ ఆశలు నెరవేర్చగలడా తను' వాళ్ళు ప్రకటించిన ప్రకారం చేరిన నాటినుంచి అంతా కలిపి నెలకి రెండొందల యాభై మించదు జీతం. ఇందులో తను తిని, పల్లెలో తన యిల్లు గడిచి, పొలంమీద అప్పుతీరాలి. ఆపైన చెల్లెలు పెళ్ళి

'మీరేం చదివారు' మెల్లగా పక్కతను అడిగాడు ఈ లోకంలోకి వచ్చాడు సీతాపతి. సమాధానం చెప్పి 'మీరూ?' అనడిగాడు.

అతను పేలవంగా నవ్వాడు 'ఎమ్.కామ్. క్లాసుకూడా వచ్చింది.'

ఆ సమాధానంతో సీతాపతిలో మినుకు మినుకుమని వెలుగుతున్న ఆశాజ్యోతిలో నూనె యింకిపోయింది పూర్తిగా. సీతాపతి ముఖంచూసి అతను సంగతి చదివేశాడు 'చూడండి ఇంటర్‌వ్యూ అంటే పెళ్ళిచూపులు. ఉద్యోగం ఇవ్వటానికి డిగ్రీతో సంభంధం లేదు.'

'పెళ్ళిచూపులా' తెల్లబోయాడు సీతాపతి.

'అవునండీ పెళ్ళిచూపులకివచ్చి పిల్ల అందం, గుణం చదువు అన్నిటిని శల్య పరీక్షచేస్తారు. కాని వాటివల్ల జరిగేదేమిటి చెప్పండి.'

'మరి అవి నచ్చితేనే గదా పెళ్ళి కుదిరేది.'

'పొరపాటు. నచ్చవలసింది మనం యిచ్చుకునే కట్నం. అది సరిపోతే ఆ రంగు తక్కువైతేనేం గుణవంతురాలు అంటూ సద్దుకుపోతారు. కట్నం నచ్చలేదూ అప్పుడు పిల్లనచ్చదు. మరి ఈ ఉద్యోగాలూ అంతే. ఇక్కడ మనం యిచ్చుకునే కట్నం రెండు రకాలు. ఒకటి పచ్చ కాగితం, రెండోది తెల్లకాగితం—అంటే రికమెండేషన్ — అతను వేదాంతిలా నవ్వాడు.

ఈ మాటలు వినేసరికి సీతాపతికి గుండె దడదడలాడటం మొదలెట్టింది. 'అయితే తన చెల్లెలి పెళ్ళి ఎలాచెయ్యటం? తను తను అమ్మ ఆశ నెరవేర్చగలడా?' ఆ క్షణాన సీతాపతి మనస్సు తన ఉద్యోగన్ని వదిలి చెల్లెలు సీత భవిష్యత్తు గురించి తపనచెందటం మొదలెట్టింది.

ఇంటర్‌వ్యూ ప్రారంభమైంది. లోపలికి వెళ్ళివచ్చిన మొదటి వ్యక్తి చుట్టూ చేరారు పలుగురు.

'ఏమడిగారు.'

'ఏమన్నారు!'

అతనడిగిన ప్రశ్నలనుబట్టి తమను ఏమడిగేదీ ఊహించుకు, బాగా ఆలోచించుకుని చక్కగా సమాధానాలు చెప్పవచ్చుని ఒక ఆశ. అతనికి ఉద్యోగం ఇచ్చేశారేమో అనే భయం.

ఆ వ్యక్తి దీర్ఘంగా నిట్టూర్చాడు. 'నేను మాథమెటిక్స్ బి. ఎ. ని. వాళ్ళు హిస్టరీ అడిగితే ఏం చెప్పగలను—ఎప్పుడో హైస్కూల్లోనే వదిలేశా దాన్ని.'

'హిస్టరీకి ఈ ఉద్యోగానికీ ఉన్న సంబంధం ఏమిటి మీ సబ్జక్టు అడగాలిగాని.'

'నేను చదివిన లెక్కలతో మాత్రం ఈ ఉద్యోగానికి ఏం సంబంధం ఉంది. ఏదో జనరల్‌గా అడుగుతారని చాలా ప్రిపేర్ అయ్యాను' అతను నిస్పృహతో నిష్క్రమించాడు.

'నాకు తెలుసు ఈ ఉద్యోగం ఇదివరకే ఎవరికో ఖాయం అయి ఉంటుంది. మనం ఆశ చావక రావటంగాని నిజంగా ఇంత దూరం ఉట్టిచేతుల్తో రావటం శుద్ధ దండుగ. ఏదో మన డ్యూటీ మనం చెయ్యటం అంతే.'

అంతసేపు ఎవరితో మాట్లాడకుండా ఓ పెడగా కూర్చున్నతను లేచాడు. హుందాగా చిరునవ్వులు చిందిస్తూ లోపలికి వెళ్ళాడు.

'బహుశా ఇతనికే వస్తుంది అందుకే అంత ఠీవిగా కూచున్నాడు' తక్కినవాళ్ళు చెవులు కొరుక్కుంటున్నారు.

ఇవన్నీ చూస్తూ ఉంటే సీతాపతికి తను అప్పుచేసి ఇక్కడికి రావటం ఎంత తెలివి తక్కువ పనో అర్థం అవటం మొదలు పెట్టింది. 'మరో నాలుగేళ్ళలో తాకట్టు వాకట్టు కాబోయే తన పొలం, పెళ్ళీడు మించిపోతున్న చెల్లెలు, బక్కచిక్కినతల్లీ సీతాపతికి ఆలోచించటానికి భయంవేసింది. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

'ఏమండీ! ఏమిటి అలావచ్చారు' ఆత్రుతగా వినిపించిన ప్రశ్నతో సీతాపతి కళ్ళు తెరిచాడు.

ఇందాక హుందాగా లోపలకు వెళ్ళిన వ్యక్తి వాడబారిన ముఖంతో బయటికి వచ్చాడు. 'నేను రికమెండేషన్‌తో వచ్చాను. కానీ ప్రయోజనం లేకపోయింది.'

'రికమెండేషన్ తెచ్చినా ప్రయోజనం లేకపోయిందా?' ఆశ్చర్యంతో నిశ్చేష్టుడై పోయాడు సీతాపతి.


గేయాల రచయితలకి
మనవి

ఆంధ్రపత్రికవారపత్రికకి గేయాలు పంపేవారు వీలయినంతవరకూ 15 పంక్తులు మించనివి పంపగోరుతాము.

— సంపాదకుడు.



వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టరు



ప్రపంచప్రఖ్యాతిగల, శక్తివంతమయిన 3 బ్యాండ్ లీవర్స్ 'టెలి-వేషనల్' ఇంగ్లీష్ మోడల్ ట్రాన్సిస్టర్ గ్యారంటీతో నెలకు రు. 5 లు వంతున చెల్లించి పొందండి. ధర: రు. 165. ప్రతి పట్టణమునకు, గ్రామమునకు పంపబడగలదు.

LITZ AGENCIES (WAP)
P. B. 1267, DELHI—6.



ఆరోగ్య సౌభాగ్యములకు
మహిళలు ఆధారపడునవి
ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో
లోధ్ర
గర్భపోషణకు, సుఖ ప్రసవమునకు
గర్భరక్షక
దేహపుష్టికి, మలబద్ధకమునకు
మాదీఫల రసాయనం
ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి
సౌభాగ్యశొంఠి
68 సంవత్సరములకు పైగా
ప్రసిద్ధి నొందిన ఔషధములు.
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మదరాసు—14.
ఏజెంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్)
విజయవాడ.


# సుమతి

'అష్టకష్టాలుపడి ఒక ఎమ్. ఎల్. ఏ దగ్గర్నుంచి రికమెండేషన్ తెచ్చానండీ. ఆ ఎమ్. ఎల్. ఏ ఆఫీసరుకు బంధువు కూడా.'

'మరైతే ఎందుకిలా జరిగిందండీ' సీతాపతికి ఇంద్రజాలంలా తోచింది—

'ఎవరో మంత్రిగారు మరొకతనికి ఉద్యోగం యివ్వమని స్వయంగా ఫోనుచేసి చెప్పారట—మంత్రిగారిమాట కాదనటానికి ఎవరికైతేమాత్రం ఎన్నిగుండెలు ఉంటాయండి. పాపం! ఆఫీసరు చాలా నొచ్చుకున్నాడు. ఇంకోసారి ఛాన్సువస్తే తప్పకుండా యిస్తానన్నాడు. ఇంతకీ నా రోజులు బాగుండలేదు. లేకపోతే ఏమిటి చెప్పండి ఈ రికమెండేషన్ సంపాదించటానికి ఎంతమంది కాళ్ళు పట్టుకున్నానో, ఎంత డబ్బు ఖర్చయిందో ఆ భగవంతుడికే తెలుసు' అతను చాలా బాధపడ్డాడు.

'మరయితే ఆ మంత్రిగారి మనిషి ఎవరండీ ఇందరిలో'

'ఏమో ఎవరైతేమాత్రం నాకేం. మధ్యలోవచ్చి గద్దతన్నుకుని పోయినట్టు ఎగరేసుకుపోయాడు ఉద్యోగాన్ని' అక్కస్సుగా అనేసి అతను వెళ్ళిపోయాడు.

'అయితే మనం యింక లోపలికి వెళ్ళటం ఎందుకు. ఇంటికిపోతే సరిపోలా' దిగాలుగా అన్నాడు సీతాపతి.


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!
Bensons-2141-TEL


'ఇంతదూరం వచ్చి వెనక్కిపోటం ఎందుకు? చూద్దాం ఎలా ఇంటర్వ్యూ చేస్తారో! ఇదో అనుభవం. ఎలాగూ ఉద్యోగం ఇచ్చే అభిప్రాయం వాళ్ళకి లేదని తెలిసిందిగాబట్టి సమాధానాలు మనయిష్టం వచ్చినట్టు చెప్పవచ్చు' చాలా ఉత్సాహంగా మాట్లాడుతున్న అతన్ని చూసి ఉండబట్టలేక సీతాపతి అడిగేశాడు.

'ఉద్యోగం ఎవరికో ఖాయం అయిందని తెలిసికూడా మీరంతా దిలాసాగా ఎలా ఉన్నారో నాకర్థం కావటంలేదు. ఇంతకీ మీరు ఏదైనా ఉద్యోగం చేస్తూ ఉన్నారా.'

'నేనుకూడా ఒకప్పుడు మీలాగే దిగులు పడ్డానండీ! కాని యిప్పుడు ఆదిగులు లేదు' అతను ఉపోద్ఘాతం ప్రారంభించాడు. 'నాపేరు రామారావు. నేను బి. ఎ. పాసై నాలుగేళ్ళ ఉద్యోగాల్ని వేటాడాను. ఒక్కటీ చిక్కలేదు. ఇంతలో నాన్న రిటైరు అయ్యారు. మాది పెద్ద కుటుంబం నేను పెద్దకొడుకును. 'ఇక మీద యిల్లెలా గడవాలి?' అన్నది గడ్డు ప్రశ్న అయ్యింది. అప్పటికి కద్దరి చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు అయినాయి. కాని యింకా యిద్దరు పెళ్ళికి సిద్ధంగా ఉన్నారు. ఎన్ని రకాలుగా ఆలోచించినా పరిష్కారం దొరకలేదు. చివరికి విసుగెత్తిపోయింది. నాన్నకొచ్చిన ప్రావిడెంటు ఫండుతో కిళ్ళీకొట్టు పెట్టాను.' 'కిళ్ళీకొట్టా' ఆశ్చర్యపోయాడు సీతాపతి.

'అవునండీ ఆతర్వాత చెల్లెళ్ళచేత మెట్రిక్ కట్టించాను. వాళ్ళు ఏవో ట్యూషన్లు చెప్పి తలో యాభై తెచ్చుకుంటున్నారు. ఆడబ్బు వాళ్ళ పేర బేంకులో వేస్తున్నాం ఏదో భగవంతుడి దయవల్ల కొట్టురాబడితో యిల్లు నెట్టుకొస్తున్నాం'

'మరైతే మీరీ ఉద్యోగానికి ఎందుకొచ్చారు' సీతాపతి సందేహం వెలిబుచ్చాడు.

'ఇప్పుడు మా తమ్ముడుకూడా నిరుద్యోగ డిపార్టుమెంటులోకి రాబోతున్నాడు. ఈ మార్చిలో చదువైపోతుంది. అందువల్ల అదృష్టంకొద్దీ ఈ ఛాన్సు తగిలితే వాడు కిళ్ళీకొట్టు నడుపుకుంటాడు గదా అని అప్లికేషన్ పెట్టాను అంతే' అన్నాడు రామారావు నవ్వుతూ.

'మీరు లోపలికి వెడితే వెళ్ళండి కాని

నేనుమాత్రం వెళ్ళిపోతాను' సీతాపతి చాలా అసహనంగా లేచాడు.

రామారావు నవ్వుతూ ఊరుకున్నాడు. సీతాపతికి ఏంచెయ్యాలో తోచిందికాదు. మళ్ళీ రామారావే అన్నాడు 'మీ సంగతేమీ చెప్పారుకాదు' అని.

సీతాపతి సంక్షిప్తంగా తనసంగతి చెప్పేశాడు. అంతలో రా మా రా వు కు లోపలికి రమ్మని ఆహ్వానం వచ్చింది 'మరి నేవచ్చేసరికి వెళ్ళిపోరుగా. ఉండండి' అంటూ రామారావు లోపలికి వెళ్ళాడు.

పదినిముషాలు లోపలే రామారావు తిరిగివచ్చాడు సీతాపతి. అతనితో బయలు దేరాడు 'ఏం చెయ్యాలో అర్థం కావటం లేదు' దీర్ఘంగా నిట్టూర్చాడు.

రామారావు చాలా తేలిగ్గా నవ్వేశాడు 'చూడండి చెయ్యదలుచుకుంటే పనులే దొరకవుటండీ! మా యింటిదగ్గిర పనిమనిషి కొడుక్కు పి. యు. సి. చెప్పించింది కష్టపడి. తీరా వాడికీ ఇదేసమస్య. చివరికి వాడేం చేస్తున్నాడో మీకు తెలుసా హాయిగా రిక్షా తొక్కుతున్నాడు.'

సీతాపతి ఆశ్చర్యంగా చూశాడు రామారావుని! 'అవును రిక్షా తొక్కి రోజుకు 5 నించి 10 రూపాయలదాకా సంపాదిస్తున్నాడు. పని ఏదైతేనేం పొట్టగడవటం ముఖ్యం. అన్యాయమార్గం కాకపోతే చాలు. అదేదో చిన్నప్పుడు చదివిన పద్యం ఉంది చూడండి 'మిడిమేలపు దొరవి కొల్చి మిడుకుట కంటెన్, పడిగల యొద్దుల గట్టుక మడిదున్నుక బతుకవచ్చు' అని అలా ఈ ఆఫీసు ఉద్యోగాలకన్నా హాయిగా స్వతంత్రజీవనంలోనే సుఖంఉందనుకోండి.'

సీతాపతి రామారావు ముఖం చూశాడొక్కసారి. 'మరి నేనింక వెడతానండి. మీ ఎడ్రస్సిచ్చారుగా ఎప్పుడైనా వస్తే మిమ్మల్ని తప్పకుండా కలుస్తా' నమస్కారం చేసి బస్సుస్టాండువైపు నడిచాడు సీతాపతి.

స్థి ర ని శ్చ య ం తో, పల్లెవైపు ప్రయాణం చేస్తున్న సీతాపతి కళ్ళముందు చెయ్యెత్తు ఎద్దులు, తనపొలం పక్కనే రామయ్యమామ కొలువున్నాడని చెప్పిన పొలం తన గడపలో మామిడాకు తోరణాలు ఇంకా ఏవేవో దృశ్యాలు కదులుతూ ఉన్నాయి. ●


# ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే

# టూత్ పేస్ట్ — నీమ్

## నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను

శుభ్రపరచడమేగాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణచేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్‌వారి ఉత్పత్తి